# కనువిప్పు

శ్రీమతి కె. రామలక్ష్మి

బాగా చీకటి పడిపోయింది. అక్కడా అక్కడ ఒక్కొక్క నక్షత్రం మెరుస్తున్నా లాభం కన్పించడంలేదు. ఒకపక్క ఆకాశం మబ్బుతో నిండిపోతూంది. వర్షం వస్తుందా? లేకుంటే ఉత్తినే మనుషుల్ని భయపెట్టడానికా?...అంత దట్టమయిన మబ్బుల్లోంచీ ఎందుకో కష్టపడి ఆ నక్షత్రాలు మెరవడం! కిటికీ కటకటాలలోంచి చూస్తూ కృష్ణమూర్తి అనుకొన్నాడు. అలా చూస్తూవుండగానే అంత చీకటినీ చీల్చుకొంటూ తన యింటివైపు ఎవరో నడిచి వస్తున్నారు. ఎవరై వుంటారు— ఇంత చీకట్లో, అంత హడావిడిగా తన యింటికి వచ్చేవాళ్లెవరుంటారు? కృష్ణమూర్తి ఆలోచనలు అంతం అవలేదు. ఆ వ్యక్తి మెట్లుకు వీధి గుమ్మందాకా వచ్చేసింది. కృష్ణమూర్తి హడావిడిగా వెళ్ళి తలుపు తీశాడు. తన ఎదుట నిలిచిన వ్యక్తిని చూసి నిర్ఘాంతపోయాడు. నిశ్చయంగా తన ముఖంలోకి చూస్తూంది. ఏమిటీ మనిషి ధైర్యం. చీకట్లో, చలిలో ఏకాంతంగా వున్న ఒక బ్రహ్మచారి యింటికి, ఒక ఆడపిల్ల పని కట్టుకువచ్చి తలుపు తట్టడం! కృష్ణమూర్తి గుండెలు గబగబ కొట్టుకోవడం ప్రారంభించాయి. శరీరం కంపించింది.

"ఎవరూ?" ఎంతో ఆశ్చర్యపడ్డ ధ్వనితో అడగాలన్న కృష్ణమూర్తి ప్రయత్నం ఫలించలేదు. 'నేనే!' అంది—కొంచెం కటువుగానే.

"ఓ, నాతో పనుందా? నాతో ఎవరికేనా పని వుంటుందా?" తనను తను ప్రశ్నించుకున్న ధోరణిలో అడిగాడు కృష్ణమూర్తి.

"మిమ్మల్ని ఓ సంగతి అడుగుదామని వచ్చాను" కొంచెం ఆగింది. ఆమె ముఖం చిట్లించుకుంటోందో లేదో కన్పించలేదు కాని, కృష్ణమూర్తి ఆమె కనుక్కున్నట్టు మాత్రం గ్రహించాడు. ఆమె ముఖం జ్ఞాపకానికి వచ్చింది. తీర్చి దిద్దినట్టున్నా దళసరి కనుబొమలూ, పొడిసైన చిన్న కళ్ళూ, కుడి చెంప మీద చిన్న పుట్టుమచ్చ.

"ఇలా వచ్చానని, నన్నుగురించి వింతగా ఆలోచిస్తారని తెలుసు."

"కాదు పార్వతీ, అలా ఆలోచించవలసిందేమీ లేదు." ఆమె మాట పూర్తవకుండానే అందుకొని అన్నాడు కృష్ణమూర్తి.

"అవును. మీరలాగే ఆలోచిస్తున్నారు." కఠినంగా అంది పార్వతి. "సరే కాని, ఒకటి అడుగుదామని వచ్చాను—మధ్యాహ్నం మీరన్న మాట జ్ఞాపకం వుంది—'నమ్మడంలో అర్థం లేదని.' నిజంగా మీరు నమ్మే అన్నారా అలా?" పార్వతి తన సమాధానంకోసం ఆత్రంగా చూస్తూందని తెలుసు.

"మీరే అలా అన్నారా?" వణుకుతున్న గొంతుకతో అడిగాడు.

"అవును. అలాగే అన్నారు. జ్ఞాపకానికి తెచ్చుకోండి. అయినా అలాంటి బరువైన మాట అనేసిన వెంటనే ఎలా మరిచిపోగలుగుతారో? అయినా, నమ్మి అలా అన్నారో, లేకుంటే తెలివిగా వుంది కదా అని అనుకున్నారో తెలుసుకుందామని వచ్చాను. చూడండి, ఆ యింట్లో, మా యింట్లో అందరూ తెలివిగా మాట్లాడాలని చూస్తారే గాని, నమ్మినవాటిని చెప్పాలని చూడరు. అందుకే అడుగుదామని వచ్చాను" అంది పార్వతి. ఈ పార్వతి, తను ఆ యింట్లో వున్నంతసేపూ తలెత్తి చూడలేదు. నోరు విప్పి మాట్లాడలేదు. అలాంటిది తన మాటల విలువ తెలుసుకొందుకు పని కట్టుకొని యీ చీకట్లో వచ్చిందంటే, ఆశ్చర్యపడ్డం మాట అటుంచి, స్తబ్ధుడయిపోయాడు కృష్ణమూర్తి.

"అవును. నిజమని నమ్మే అలా అన్నాను. నా దృష్టిలో నమ్మిక ఒక సద్గుణం కాదు. అది మానవ బలహీనత."

"నిజంగానా?" అని పార్వతి ప్రశ్నిస్తే, అవునన్నాడు కృష్ణమూర్తి.

"సరే, నే నడతాను. అది తెలుసుకుందుకే వచ్చాను. ఇన్నాళ్ళుగా నేను నమ్ముతూనే వచ్చాను. ఇకమీదట కొత్తమార్గం పడతాను. నే నెప్పుడూ నమ్మడానికే ప్రయత్నించేదాన్ని మీరు అలా కాదు. అవునా?"

"ఏమో, నా కెలా తెలుస్తుంది. నీ వడిగే దానికి 'సాక్షం వినుకో' మాటలతోను తిరిగేను కొంటూ, మాటలు తడబడుతూంటే అడిగాడు కృష్ణమూర్తి.

"మీకే తెలియకుండా నమ్ముతున్నారేమో!"

"లేదు. నే నమ్మను. నమ్మి మోసపోను" గట్టిగా అన్నాడు కృష్ణమూర్తి.

"యీ సంగతి మిమ్మల్ని బాధపెట్టదా ఎప్పుడూ? తెలివితేటలు ఉట్టిపడేలా మాట్లాడ్డానికి ప్రయత్నించకండి. అలాంటివాళ్ళని చూస్తే నాకసహ్యం."

"అలా ఏం కాను."

"దాన్ని ఎప్పుడూ ఆలోచించనైనా ఆలోచించరా?"

"ఆలోచించను. చాలా దృఢంగానే అన్నాడు కృష్ణమూర్తి.

"అవునులెండి. అసలాలోచనే లేనివాళ్ళకి ఏదీ లేదు. ఈ జీవితంలో ఏది నమ్మినా ఏది నమ్మకున్నా బాధలేదు వాళ్ళకు." అప్పుడే ఆలోచనలు చాలాదూరం ఆలోచించినట్టూ, మాటలు మాత్రం యింకా మొదట్లోనే వున్నట్టూ మాట్లాడుతోంది పార్వతి.

"నమ్మడంలో సౌఖ్యంలేదు పార్వతీ; మన శాంతి పోగొట్టుకోవడం తప్ప."

"అవును. మీ రన్నదే నిజం. నమ్మడంలో సౌఖ్యంలేదు." అంటూండగా పార్వతి కంఠ స్వరం ఒణికింది. ఆమె వెనుతిరిగి అవతలికి అడుగు వేసింది. కృష్ణమూర్తి బయటికి వచ్చాడు...యిందాకటినుండీ ఉత్తినే వున్న మబ్బులు మెల్లిమెల్లిగా వర్షిస్తున్నాయి. చేయి జాపి వర్షపు జోరు చూశాడు. ఆకాశం యిందాకటికంటే చీకటిగా వుంది. ఆ వర్షంలోనే గబగబ మెట్లు దిగింది పార్వతి.


"పార్వతీ యిలా వచ్చి పక్కగా నించో. బాగా చినుకులు పడుతున్నాయి" అన్నాడు కృష్ణమూర్తి.

"లేదు కృష్ణమూర్తీ మళ్ళా ఆయింట్లో అడుగు పెట్టను. ఇలా మొదలుకొని నిల్చుంటాను లే" అంటూ గోడవారగా వచ్చి నిల్చుంది పార్వతి. "నువ్వో యిలా వచ్చి నించో" అంది.

"ఇక్కడ బాగానే వుంది." ముక్తసరిగా సమాధానమిచ్చాడు కృష్ణమూర్తి.

"ఫరవా లేదు. నన్ను చూసి భయపడక్కర లేదు" కటువుగా అంది పార్వతి. ఏమిటీ పార్వతీ! గౌరవించడం తెలియదు. గౌరవం పొందడం తెలియదు.

"నే వెడతాను. బాగా లేటయివుంటుంది" అంటూ చెయిజాపింది పార్వతి. ఆ చాపిన చేయిని తన చేతులలోకి తీసుకొంటూ "పార్వతీ యింటిదాకా వస్తాను. చీకటిగా వుంది." ఆ చీకటిరాత్రిలో ఆమె చేయి తన చేయిని నొక్కితే. అదే ఆ రాత్రి యిచ్చే అర్థంకాని సందేశంగా తలపోశాడు కృష్ణమూర్తి. ఆమె అన్నమాటలు నిజం కావనీ, ఆమె హృదయపు లోతులలో భావాలు వేరనీ...చెప్తున్నట్టనిపించింది—ఆ చేయి వేడి. తను అన్నవీ అంతేనని చెప్దామనుకున్నాడు. కాని మాటలు దొరికలేదు. వెడతానని చెప్పి, ఆమె అలాగే నిల్చుంది. ఇద్దరికీ మాట్లాడడానికి మాటలు లేవు. అయినా మోయలేని బరువుతో క్రుంగిపోతున్నట్లు వారి హృదయాలు భారంగా వున్నాయి. మరుక్షణాన్నే మారుమాట లేకుండా ఆమె ముందుకు నడవడం ప్రారంభించింది. 'పార్వతీ' మెల్లిగా పిలిచాడు కృష్ణమూర్తి. ఏం చెప్దామని పిలిచాడో జ్ఞాపకం లేదు. ఆమె వెళ్ళిపోతుంటే, అతని గొంతుక విడింది. అంతే. అర్థంలేని నవ్వు నవ్వేడు. ఆమెనుచూసి సిగ్గుపడ్డాడు. తనను చూసుకొని సిగ్గుపడ్డాడు. ఇద్దరూ కూడా, యీ ప్రపంచంలో ఏ ఆడదీ, ఏ మొగవాడు ప్రవర్తించనట్లు ప్రవర్తించారు......కొద్దిసేపట్లోనే ఆమెను యింటిదాకా దిగబెట్టి తిరిగి వచ్చి కిటికీదగ్గర నిల్చున్నాడు కృష్ణమూర్తి. 'నామీద ఏవిధమైన ఆశలేనా పెట్టుకొందేమో!" అనుకొన్నాడు కృష్ణమూర్తి. ఈ ఆలోచన అతన్ని వున్మత్తుణ్ణి చేసింది. అతని శరీరం గాలిలో తేలుతున్నట్టనిపించింది. మానవుడుగా అతని జీవితంలో యింత గర్వపడేటట్టు చేసిన ఆలోచన యింకొకటి లేదు. ఏ ఆడదైనా చూసిన గాజునే తననంత ఉన్మత్తుణ్ణి చేస్తుందని అనుకోలేదు. తన ముఖం చూస్తే, తన కళ్ళలోకి చూస్తే, ఇంత ప్రేమించడానికి కాని ద్వేషించడానికి కాని అవకాశం వుండదు—తన కళ్ళే ఆ సంగతి చెప్తాయి అనుకున్నాడు. అయినా, తనన్న మాటను గురించి ఎందుకంత దీర్ఘాలోచన చేసింది! ఏమో, దానిలో ఏ నమ్మకమూ లేకుండా నే అన్నదేమో! ఎదురుగుండా వచ్చి అడిగితే, అందులోనూ, అలాంటి సమయంలో....తనేం చెప్తాడు....[illegible] దేహా నిజం తెలుసుకోవాలంటే అదా టైము?



"మిమ్మల్ని ఒక విషయం అడుగుదామని వచ్చాను" అన్నది పార్వతి

మబ్బుపట్టిన రాత్రి వేళ, ఒంటరిగా తా నుంటున్న యింటికి, ఎంత ధైర్యంగా వచ్చింది!...ఏమో, కౌవశత్వాన్ని కల్గించే ఉన్మత్తవాంఛలు ప్రేరేపించి, అలా ప్రవర్తింప చేస్తాయేమో! ఏమో! ఆలోచనలకూ ఆకృతి నివ్వలేక పోయాడు కృష్ణమూర్తి.... అలాంటి అమ్మాయిని పెళ్ళి చేసుకొంటే! [illegible] వచ్చి నవ్వుకున్నాడు. [illegible] లోని లోటున్నీ లెక్క పెట్టి చూశాడు.......

పార్వతి కాదు తనకు నచ్చేది-పార్వతి చెల్లెలు.... నన్నుచూసి భయపడక్కరలేదని ఓ ఆడపిల్ల అనడం, తానేమో దానికి సమాధానంగా వెర్రినవ్వు నవ్వడం! ఏం బాగుంది? ఏం అహంభావం పార్వతిది. మొగవాడికి కూడా వుండదే! ....కాని ఆమెలో ఏదో అతన్ని ఆకర్షించింది. నిడుపైన ఆమె కన్నులు, గుండ్రని ఆమె [illegible] ఆమె నడక తీరు....ఇదంతా పిచ్చి వూహాలు....

ప్రశాంతమైన నిశాసమయంలో ఓ ఆడపిల్లను చూడ్డం, మాట్లాడ్డం, ఆమె చేయి తన చేతిలోకి తీసుకోవడం అంతా ఊహించి—అని తన మెదడును ప్రశాంత పరచుకోబోయాడు కృష్ణమూర్తి...అయినా....పార్వతి ఆ మెదడులో అక్కడక్కడ తిరుగుతూనే వుంది.

రోజులూ వారాలూ గడిచిపోతున్నాయి. కృష్ణమూర్తి పార్వతిని చూస్తూనే వున్నాడు. మాట్లాడుతూనే వున్నాడు. అసలు ఆమెను తప్పించుకోలేకపోతున్నాడు. ఆమె అతని వూహలను పూర్తిగా ఆక్రమించుకొంది... ఆ కొన్ని రోజుల్లోనూ ఒక నిశ్చయానికి వచ్చాడు పార్వతిని పెళ్ళిచేసుకోవాలని. ఆమెలో ఏదో ఆకర్షణ వుంది. అదేమిటో తెలియదు. అయినా ఆమెను వివాహం ఆడాలనే నిశ్చయించుకున్నాడు కృష్ణమూర్తి. ఆ రోజు కొట్లో అన్నీ సర్దేసి, అందరూ వెళ్ళిపోయాక తనూ వెళ్ళిపోవడానికి సిద్ధపడుతూంటే వీధి గుమ్మంలోనుంచి "కృష్ణమూర్తీ కృష్ణమూర్తీ" అని కేక వినిపించింది. తిరిగి చూశాడు. పార్వతి చక్కగా అలంకరించుకొని వచ్చింది. "ఏం పార్వతీ! ఏదో విశేషం వున్నట్టుందే?" అంటూ ఇవతలకు వచ్చాడు.

"నేను వూరికి వెళ్ళిపోతున్నాను కృష్ణమూర్తీ! మళ్ళీ ఎప్పుడొస్తానో తెలియదు. ఇంటికి వస్తే లేవు. సరే అని యిక్కడికే వచ్చాను. ఇంకా ఏదో చెప్పబోయిన ఆమె ప్రయత్నం. కాని తన ధోరణి ఆపి కృష్ణమూర్తి కేసి చూసి ఆశ్చర్యపోయింది.... "ఏం కృష్ణమూర్తీ! నీకు ఒంట్లో బాగులేదా? అలా వున్నావేం?" అంటూ పార్వతి ప్రశ్నలవర్షం కురిపించింది.

"ఇంత హఠాత్తుగా వూరికి వెడుతున్నావు పార్వతీ! ఈ వారంలో రేపో మీ యింటికి వచ్చి మీ నాన్నగారిని కలుసుకుందామనుకుంటున్నాను." నూతిలోనుంచి మాట్లాడినట్లు వినిపిస్తూంది.

"ఏ విషయమై మా నాన్నను?" పార్వతి చాలా కొంటెగా ప్రశ్నించింది.

"ఆ దేమిటి పార్వతీ! అడుగుతావేం? నిన్ను నాకిచ్చి వివాహం చేయడానికి ఏమైనా అభ్యంతరాలున్నాయేమో. అడుగుతాను. లేకుంటే, వచ్చేవారమే పెళ్ళి. అంతే" చాలా ఉత్సాహంగా అన్నాడు కృష్ణమూర్తి. కాని పార్వతి అంత ఉత్సాహంగా లేదు.

"ఆయన అభ్యంతరాలున్నాయంటే ఏం చేస్తావు కృష్ణమూర్తీ!" ఈ సూటి ప్రశ్నకు సమాధానం దొరకలేదతనికి. అవును, అలా అంటే ఏం చేస్తాడు?

"ఇలాగే వుండిపోతాను పార్వతీ!" అని చాలా బాధగా అన్నాడు. కాని దానికి పార్వతి నవ్వింది. ఎందుకు నవ్విందో?

"చూడు కృష్ణమూర్తీ! అసలీ జీవితంలో నమ్మకం అన్నది సహజం కాదు. అది నాకు తెలుసు. కాని నీనుండి నేనూ నేర్చుకున్నాను. ఇప్పుడు నిన్ను ఎలా నమ్మమంటావు?" అని, "రా కృష్ణమూర్తీ! నడిచి యింటికి పోదాం. రాత్రి నా ప్రయాణం. మళ్ళీ ఎప్పుడో...."

"పోనీ ఎడ్రసు యిస్తావా?"

"ఎడ్రసు దేనికి? నేను బతికున్న సంగతి నువ్వు మరిచిపో. నువ్వు నేర్పిన పాఠం నేను మరిచిపోను. ఏం?" అంటూ పార్వతి నడవడం ప్రారంభించింది. కొట్టు మూసి కృష్ణమూర్తి ఆమెను కలుసుకున్నాడు. ఆమెను వాళ్ళింటిదగ్గర వదిలి.......తను బయలుదేరాడు. అయితే, ఈ పార్వతిని తను నమ్మించలేడా! పార్వతి యిన్నాళ్ళూ తన మనశ్శాంతితో చెలగాటం ఆడిందా?......అయినా వూరికి పోయిన తర్వాతనే వుత్తరం వ్రాస్తుంది. అన్నీ స్థిమితపడతాయి....తనకు తను చెప్పుకొన్నాడు కృష్ణమూర్తి.......పార్వతి తనకు కావాలి. ఆ విషయం పార్వతి నమ్మాలి....ఆ రోజు రాకపోదు. ఆ ధైర్యంతో హాయిగా తేలికపడిన హృదయంతో యిల్లు చేరుకొన్నాడు.

* * *

పార్వతి వెళ్ళి ఐదారు మాసాలైనా ఉత్తరం లేదు. పార్వతి చెల్లెల్ని ఎన్నోసార్లు అడిగాడు. ఆఖరికి ఒకరోజు ప్రాణం విసిగి కాబోలు అసలు సంగతి చెప్పింది. పార్వతి బెంగుళూరులో వుంది. పేరుమోసిన ఒక ధనికుణ్ణి వివాహం చేసుకొంది. హాయిగానే వుంది. ఈ మాటలు విన్న కృష్ణమూర్తికి తనెక్కడున్నాడో తెలియలేదు. ఎంత అన్యాయం చేసింది పార్వతి. ఏం తనకే చెప్తేనేం—తనకు యిష్టం లేదని!

"ఇంట్లో ఎప్పుడూ యీ పెళ్ళివిషయం అనుకోలేదా?"

"నాన్నగారికి నువ్వంటే యిష్టమే కాని పార్వతే చెప్పింది—నువ్వు నమ్మకస్తుడివి కావని. అసలు ఎవరినీ నువ్వు నమ్మవని."

"అయితే, పార్వతి నా కెందుకు చెప్పలేదు?" అసహాయుడుగా అడిగాడు.

"చెప్పిందండీ! అయినా నీకు ఎడ్రసు తెలిసివుండదు" అంది.

ఇక అక్కడ నిల్చోలేకపోయాడు కృష్ణమూర్తి. దారిలో అనుకున్నాడు — పోనీ ఎడ్రసు కనుక్కొని ఎందుకిలా చేసిందో రాద్దామనుకున్నా.......ఎందుకులే....పోనీ, పార్వతితో అన్నట్లు—యిలాగే వుండిపోతే, కొన్నాళ్ళకైనా, ఎన్నేళ్ళకైనా పార్వతి తెలుసుకుంటుంది తన తప్పిదాన్ని. అప్పుడు పశ్చాత్తాపపడుతుంది. అవకాశం వుంటే, ఆమె కవసరం అయితే అప్పుడూ తనామెను చేరతీస్తాడు—అని నిశ్చయించుకొన్న కృష్ణమూర్తి యిక తన దృష్టంతా వ్యాపారంమీదనే వుంచి అభివృద్ధిలోకి తెచ్చుకుంటున్నాడు. ఇక అతనికి జీవితంలో కోరికలు లేవు—తిరిగి పార్వతి వస్తే తప్ప.

కాలం ఎంత త్వరగా పయనిస్తుంది! సంవత్సరాలకు సంవత్సరాలు యిట్టే గడిచిపోతాయి. మానవుని యీ గాయాలు. వాపోయిన మానవ హృదయం కూడా గాయాల సంగతి మర్చి తిరిగి గాయాలకు అవకాశాన్నిస్తూనే వుంటుంది. గడిచిపోయిన నాలుగు సంవత్సరాలలో కృష్ణమూర్తి పార్వతిని గురించి వింటూనే వున్నాడు. పార్వతి చెల్లెలు ఒకరోజు చూపింది—పార్వతి కొడుకును. మూడేళ్ళ పసివాణ్ణి....పార్వతి కష్టాలకు గురి అయిందనీ, ఆమె భర్తకు ఒంట్లో బాగుండడం లేదనీ, అందుకే పిల్లాణ్ణి యిక్కడికి పంపించేసిందని విన్నప్పుడు, రెక్కలు కట్టుకొని పార్వతి దగ్గిర వాలాలనుకున్నాడు. కాని ఆమె భర్త?....

"చూడు కృష్ణమూర్తీ యివాళ పార్వతి వస్తూంది" అని రోడ్డుమీద పోతున్న తనను ఆపి చెప్పింది పార్వతి చెల్లెలు.

"ఏం బెంగుళూరు వదిలి ఎందుకొస్తూంది? ఆమె భర్త కెలావుంది?" అనుకోకుండానే అతని హృదయం ఆతృత ప్రకటించింది. ఏనాటి పార్వతి! ఏనాటి తను? నవ్వుకున్నాడు కృష్ణమూర్తి. ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు. ఆకాశంలో మబ్బులు లేవు కాని తారకలు కూడా ఎక్కువగా మెరవడంలేదు. అయినా కృష్ణమూర్తికి మబ్బు పట్టినట్టూ, తనకోసం ఎవరో వచ్చినట్లూ అనిపించింది.

లేచి వెళ్ళి కిటికీ వూచలకు తల ఆన్చి చూస్తున్నాడు కృష్ణమూర్తి. అదే పోలిక అదే చీకటి. "కృష్ణమూర్తీ" అని ఎవరో పిలిచారు. ఎవరి కోసమో ఎదురుచూస్తున్నవాడల్లే కృష్ణమూర్తి వెళ్ళి తలుపు తెరిచాడు. పార్వతే వచ్చింది. తలుపు తెరవగానే లోపలికివచ్చి కిటికీలో కూర్చుంది. కృష్ణమూర్తి తలుపు మూసి వచ్చి కూర్చున్నాడు. ఆ గదిలో నిశ్శబ్దం భరింపరానిదిగా వుంది. ఆ భరించలేని నిశ్శబ్దాన్ని చీలుద్దామన్నట్లే—

"నే వచ్చాను కృష్ణమూర్తీ!" అంది.

"అవును. నువ్వు వస్తావనే అనుకున్నాను. వచ్చావు." కృష్ణమూర్తి మామూలుగానే అన్నాననుకున్నాడు. కాని, అతని

| 1955 సంవత్సరము | | | | | | | 1955 సంవత్సరము 1956 క్యాలెండరు కూర్పు: కె. లక్ష్మీప్రసాద్ (గుంటూరు) | | | | | 1956 సంవత్సరము | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| జనవరి-31 అక్టోబరు-31 | ఫిబ్రవరి-28 మార్చి-31 నవంబరు-30 | ఏప్రిల్-30 జూలై-31 | మే-31 | జూన్-30 | ఆగష్టు-31 | సెప్టెంబరు-30 డిశంబరు-31 | | | | | | జనవరి-31 ఏప్రిల్-30 జూలై-31 | ఫిబ్రవరి-29 ఆగష్టు-31 | మార్చి-31 నవంబరు-30 | మే-31 | జూన్-30 | సెప్టెంబరు-30 డిశంబరు-31 | అక్టోబరు-31 |
| శని | మం | శుక్ర | ఆది | బుధ | సోమ | గురు | 1 | 8 | 15 | 22 | 29 | ఆది | బుధ | గురు | మం | శుక్ర | శని | సోమ |
| ఆది | బుధ | శని | సోమ | గురు | మం | శుక్ర | 2 | 9 | 16 | 23 | 30 | సోమ | గురు | శుక్ర | బుధ | శని | ఆది | మం |
| సోమ | గురు | ఆది | మం | శుక్ర | బుధ | శని | 3 | 10 | 17 | 24 | 31 | మం | శుక్ర | శని | గురు | ఆది | సోమ | బుధ |
| మం | శుక్ర | సోమ | బుధ | శని | గురు | ఆది | 4 | 11 | 18 | 25 | × | బుధ | శని | ఆది | శుక్ర | సోమ | మం | గురు |
| బుధ | శని | మం | గురు | ఆది | శుక్ర | సోమ | 5 | 12 | 19 | 26 | × | గురు | ఆది | సోమ | శని | మం | బుధ | శుక్ర |
| గురు | ఆది | బుధ | శుక్ర | సోమ | శని | మం | 6 | 13 | 20 | 27 | × | శుక్ర | సోమ | మం | ఆది | బుధ | గురు | శని |
| శుక్ర | సోమ | గురు | శని | మం | ఆది | బుధ | 7 | 14 | 21 | 28 | × | శని | మం | బుధ | సోమ | గురు | శుక్ర | ఆది |

కంఠస్వరం—యిన్నాళ్లు అతను పడ్డ బాధా వ్యక్తం చేసింది.

"నే నేపరిస్థితులలో యిక్కడికి వచ్చేనో తెలుసా కృష్ణమూర్తీ?" సూటిగా ప్రశ్నించింది పార్వతి. పార్వతి మాట్లాడే విధంలో ఏమాత్రం మార్పు రానిది గుర్తించి కృష్ణమూర్తి నవ్వుకున్నాడు.

"అవును కృష్ణమూర్తీ, నీకు నవ్వు వస్తుంది. నా పరిస్థితులూ, నా పిరికితనం చూస్తే నీకే కాదు, ఎవ్వరికేనా నవ్వు వస్తుంది" అని చేతుల్లో ముఖం కప్పుకొని ఏడ్చింది పార్వతి. కృష్ణమూర్తి లేచి వెళ్ళి ఆమెను తన కౌగిలిలో యిముడ్చుకున్నాడు.

"పార్వతీ! ఆరోజు నేనా చెప్పి—ఆరోజు వూరికి వెళ్ళిపోయావు ఎందుకు? తరువాత యిన్నేళ్లూ నన్ను మరచిపోయావు ఎందుకు?"

"చెప్పాను. అంతా చెప్పాను....నీ కీ జీవితంలో దేనిలోనూ నమ్మకం లేదన్నావు. అలాంటిది నన్నూ నా ప్రేమనూ నమ్ముతావని ఎలా అనుకోను?" దుఃఖంలో కంఠం మూసుకుపోయింది పార్వతికి.

"పిచ్చి పార్వతీ, నమ్మకం ఒక సద్గుణం కాదు, మనశ్శాంతి పాడుచేస్తుందని నేనంటే, దానికీ నాకూ నీకూ మధ్యనున్న ప్రేమకూ గిరి గీసుకొని ఇన్ని సంవత్సరాలు వృధాచేశావు" తల నిమురుతూ అన్నాడు కృష్ణమూర్తి.

"అవును కృష్ణా, యిన్నేళ్ళు నేను ఎంత అబద్ధపు జీవితం గడిపానో నీకు తెలియదు. ఆ భర్త....ధనవంతుడే. కాని ఎన్ని అవలక్షణాలో యీ ప్రపంచంలో అన్నీ ఆయనలో వున్నాయి. జీవితాన్ని నాశనం చేసుకొని, ఆఖరికి పరమ ఛండాలంగా చనిపోయాడు. పిల్లాడు మాత్రం నాకు మిగిలాడు—గత జీవిత చిహ్నంగా....చూడు కృష్ణమూర్తీ...ఇదంతా విన్నాక నన్ను దూరంగా తోసేయాలని లేదూ?" ఆమాట విని కృష్ణమూర్తి పార్వతిని యింకా గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. "ఇప్పుడేనా నేను నిన్ను ప్రేమిస్తున్నానని నమ్ముతావా పార్వతీ? యిప్పుడేనా నేను నిన్ను నమ్ముతానని ఒప్పుకొంటావా?"

"ఒప్పుకొంటాను కృష్ణమూర్తీ, యిన్ని సంవత్సరాల దుర్ఘటనలు నాకు కల్గించిన కనువిప్పు యిదే" అతని హృదయంలో తల దాచుకొంటూ అంది పార్వతి.

"నాకు కావలసిందీ అదే పార్వతీ. ఇక ఆలస్యం లేకుండా మనిద్దరం వివాహం చేసుకుందాం" అని కృష్ణమూర్తి ఆమె కళ్ళు తుడిచాడు. పార్వతి దీర్ఘంగా నిట్టూర్చింది.

"పార్వతీ నువ్వింత పిచ్చిదానవనుకోలేదు—నిజమే —యీ జీవితంలో అన్నిటినీ నమ్మే స్త్రే అశాంతే మిగులుతుంది. అందుకే నేనలా చెయ్యాను అన్న ధోరణిలో, కొన్ని సంవత్సరాల క్రితం అలా అన్నాను. నిన్ను నమ్మేను. తత్ఫలితంగానే యిన్నేళ్ళ అశాంతికి గురి అయాను." కృష్ణమూర్తి, తనకు తను చెప్పుకుంటున్నట్లు లేక తాను అనుకుంటున్నట్లు అన్నాడు.

"అవును కృష్ణమూర్తీ, యీ జీవితంలో అన్నింటినీ నమ్మేయకూడదు. కాని నిన్ను నేనూ నన్ను నువ్వూ నమ్మాలి. అలా నమ్మకపోతే......"

"ఇన్నేళ్ళలాగే" అంటూ కృష్ణమూర్తి ఆమెను దగ్గరికి తీసుకొన్నాడు.

తూరుపు తెలతెలవారుతోంది. కృష్ణమూర్తీ పార్వతీ ఒకరి కౌగిలిలో ఒకరు సర్వాన్నీ మరచి అదే కిటికీలో అలాగే కూర్చుని వున్నారు. వారికి తెల్లవారినా తెల్లవారకపోయినా ఒకటే. ఇద్దరి జీవితాలూ ఏకంచేసి ఒకే జీవితంలా గడపడానికి నిశ్చయించుకొన్న వారి మనస్సులు ప్రశాంతంగా వున్నాయి. కృష్ణమూర్తీ పార్వతీ ఒకటి. గత జీవితకాలంలో వారు ఒకరికొకరు ఎంత దూరం అయినా, వారిరువురికీ నడుమ ఎంత అగాధమైన లోతు వున్నా....యీ తెలతెలవారు సమయంలో, వారిమధ్య దూరం లేదు, అగాధం లేదు. పార్వతికి కావలసింది అదే, కృష్ణమూర్తికి కావలసింది అదే. ★